క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎదులాపురం: మరమ్మతుల కారణంగా పట్టణంలోని కైలాస్‌నగర్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు టౌన్ 3 విద్యుత్ అధికారి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. శాంతినగర్, కుమ్మరివాడ, వాల్మీకినగర్, అటెండర్‌కాలనీ, ఓల్డ్ హౌజింగ్‌బోర్డు, పాలిటెక్నిక్, పరిశ్రమల వాడ, ఆర్‌ఆర్‌నగర్‌లో విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

‘ప్రొటోకాల్ పాటించకుండా అవమానించారు’

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుంటే స్థానికంగా ఉపాధ్యాయులు ఎలాంటి ప్రొటోకాల్ పాటించకుండా అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మామిళ్ల పార్వతిని అవమానించారని ఎంపీపీ గంద్రత్ రమేశ్ ఆరోపించారు. శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎం శ్రీ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమానికి అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ విషయంలో ప్రొటోకాల్ పాటించలేదని విమర్శించారు.

తీరిన నీటి సమస్య

నేరడిగొండ: మండలంలోని బుగ్గారం(బి) గ్రామంలో జగదాంబ ఆలయంలో నీటి సమస్య తీర్చేలా కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ శుక్రవారం బోరు వేయించారు. ఆలయంలో నీటి సౌకర్యం లేకపోవడంతో గత కొంత కాలంగా భక్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు గజేందర్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన బోరు వేయించారు. దీంతో గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.

సన్మానం

కైలాస్‌నగర్: ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ తెలంగాణ ఉపాధ్యక్షుడిగా ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్నాల నగేశ్ ఎన్నికయ్యారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. న్యాయవాదులు చందుసింగ్, ఏమాజీ, గంగారెడ్డి, శర్మ పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ

ఇచ్చోడ: మండలంలోని బోరిగామ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఉచిత పుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్యాంసుందర్ మాట్లాడుతూ.. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యనందిస్తున్నట్లు తెలిపారు.

యూనిఫాం పంపిణీ

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామంలోని మండల పరిషత్ హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలను శుక్రవారం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పుస్తకాలు, ఉచిత దుస్తులు అందజేస్తున్నామని ప్రధానోపాధ్యాయులు ఈదిగాం రాజేశ్వర్ అన్నారు. ఉపాధ్యాయురాలు మాధవి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ అరెల్లి నర్సమ్మ, క్లస్టర్ కోఆర్డినేటర్ సుభద్ర, కళావతి పాల్గొన్నారు.

విత్తనాల రశీదు జాగ్రత్తగా ఉంచుకోవాలి

బేల: విత్తనాల బిల్లులను జాగ్రత్తగా ఉంచుకోవాలని వ్యవసాయాధికారి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని విత్తనాలు, ఎరువులు విక్రయ కేంద్రాలను తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. స్టాకు వివరాలపై ఆరా తీశారు. చిన్నపాటి వర్షానికి రైతులు హడవిడిగా విత్తనాలు విత్తుకోవద్దని సూచించారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపిక

తాంసి: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ఉపాధ్యాయుడు వికేష్ శుక్రవారం తెలిపారు. ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఎస్.మహేందర్, జె.తేజశ్విని, ఎస్.కె.జాస్మిన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. ప్రతీ ఏటా ఇంటర్మీడియట్ వరకు కేంద్ర ప్రభుత్వం రూ.12వేలు స్కాలర్‌షిప్ అందించనుంది. పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

నులిపురుగు నివారణకు ప్రత్యేక కృషి

ఇచ్చోడ: నులిపురుగు నివారణకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాగర్ అన్నారు. శుక్రవారం ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. నులిపురుగు నివారణ కోసం 1 నుంచి 19 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న పిల్లలకు జూన్ 20న నివారణ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇచ్చోడ ఆరోగ్య కేంద్రం పరిధిలో 15264 మంది పిల్లలను గుర్తించినట్లు పేర్కొన్నారు.



చెట్టు కింద చదువు చెబుతున్న ఉపాధ్యాయుడు



శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం

శిథిల పాఠశాల

గాదిగూడ మండలంలోని ధర్మగూడ గ్రామంలో దాదాపు 30 మంది గిరిజన విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే పాఠశాల భవనం పగుళ్లు తేలి శిథిలావస్థకు చేరుకుంది. దీంతో విద్యార్థులకు ఉపాధ్యాయుడు చెట్టు కింద పాఠాలు చెబుతున్నాడు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా.. పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. – నార్నూర్

మొక్కలతోనే మానవ మనుగడ

● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కుప్టి గ్రామంలో కేసీఆర్ పార్కులో మొక్కలు నాటే కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి నీరు పోశారు. చెట్లే ప్రగతికి మెట్లని, ఎంత ఎక్కువగా చెట్లను పెంచితే అంత మంచిదన్నారు. తిరుగు ప్రయాణంలో బీడీ కార్మికులతో ముచ్చటించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ రాథోడ్ సజన్, సామాజిక కార్యకర్త కొయ్యాడి గంగయ్య, కుమారి పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేశ్, ఒర్స చంద్రశేఖర్ యాదవ్, రవీందర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, తులసీదాస్ పాల్గొన్నారు.

సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్యాబోధన

సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్యాబోధన అందుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని రాజురా గ్రామంలో శుక్రవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి హాజరయ్యారు. ముందుగా విద్యార్థులకు యూనిఫాం అందజేశారు.. విద్యార్థులందరూ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకోవాలన్నారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న పాఠశాల భవనాన్ని సందర్శించి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, ఏలేటి రవీందర్ రెడ్డి, జాదవ్ గణేష్, సవైరాం, ఉపాధ్యాయురాలు నాయిడి మల్లేశ్వరి పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాజురా గ్రామంలో పర్యటించి లోలెవల్ వంతెన పనులను పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మొరం రోడ్డు వేయాలన్నారు.

పాఠశాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పనులు ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని యాపల్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో వివిధ అభివృద్ధి పనులకు ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేశ్ మాట్లాడుతూ.. దేశ భవిష్యత్ నిర్ణయించే విద్యార్థుల కోసం పనిచేయడం ఎంతో ఆనందంగా ఉంటుందన్నారు. పాఠశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు తమవంతు సహకారం అందిస్తామన్నారు.

విద్యారంగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టిని సారించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటేనే విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకుంటారన్నారు. వసతుల లేమితో విద్యార్థులు శ్రద్ధతో చదువుకోక ఉత్తీర్ణత శాతం కూడా తగ్గుతుందన్నారు. అనంతరం యాపల్‌గూడ గ్రామస్తులు ఎంపీ, ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఎంపీపీ గంద్రత్ రమేశ్, సంతోష్, దత్తు, విజయ్, ఆదినాథ్, లింగు పటేల్ పాల్గొన్నారు.

మాదిగలకు రిజర్వేషన్లు కల్పించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లను కల్పించాలని తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నక్క రాందాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో నాయకులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. అధికారంలోకి వస్తే వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేస్తామని ఎన్నికల హామీగా ప్రకటించిన బీజేపీ ప్రభుత్వం పదేళ్లు తుంగలో తొక్కి మాదిగలను మోసం చేసిందని ఆరోపించారు. ఆదిలాబాద్ జిల్లాలో ఈనెల 27న బోథ్ నియోజకవర్గంలో మాదిగ, మాదిగ ఉపకులాలతో భారీ బహిరంగసభను నిర్వహిస్తామన్నారు. అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా కార్యదర్శి తారె రవికుమార్, కత్తి గంగాధర్, మహేందర్, చొప్పదండి భూమన్న, బట్టు మహేందర్, కొల్లూరి స్వామి, గజ్జల విలాస్ పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈవో శ్రీకాంత్

తాంసి: మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఎంఈవో శ్రీకాంత్, ఎంపీడీవో మోహన్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులచే పూజలు నిర్వహించి అక్షరాభ్యాసం చేయించారు. ప్రభుత్వ పాఠశాలలో వసతులతో కూడిన విద్య అందుతుందని. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సంతోష్, ఉపాధ్యాయులు సుభాష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: విద్యార్థులతో సామూహిక అక్షరాభ్యాసం చేయించాలని ఎంపీపీ పంద్ర జైవంత్ రావు అన్నారు. ఎంపీపీ ఆధ్వర్యంలో మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో అక్షరాభ్యాసం చేయించారు. నూతనంగా పాఠశాలలో చేరిన విద్యార్థులకు ఎంపీపీ, ఉపాధ్యాయులు సరస్వతి పూజ చేసి, అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వీవో లీడర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన నాయకులు

బోథ్: ఆదిలాబాద్ ఎంపీగా గెలుపొందిన గోడం నగేశ్‌ను శుక్రవారం బోథ్ మండల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహంలో మాజీ ఎంపీపీ అప్క కిషన్, ఆదివాసీ నాయకులు న్యాయవాది పంద్రం శంకర్‌తో పాటు బీజేపీ మండల కన్వీనర్ రవీందర్, సుభాష్ సూర్య, మల్లెపూల రమేశ్ తదితరులు కలిసి శాలువాతో సత్కరించారు.

ఉట్నూర్‌రూరల్: ఆదిలాబాద్ ఎంపీగా గెలుపొందిన గోడం నగేశ్‌ను మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు రాథోడ్ రమేశ్, ఉట్నూర్ మండల నాయకులు ఆదిలాబాద్‌లోని ఎంపీ నివాసంలో మర్యాద పూర్వకంగా సన్మానించారు. ఆయన నాయకులు కొండేరి రమేశ్, కొలిపాక రాజశేఖర్, బింగి వెంకటేశ్, కాల్వ రవి, సుభాశ్ ఉన్నారు.

వైద్య శిబిరం

నార్నూర్: మండలంలోని జామ్డా బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, జలుబు, దగ్గు, దవడ నొప్పితో బాధపడుతున్న విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో వసతి గృహాల్లో చదివే విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆయన వెంట హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్ దాస్, ప్రధానోపాధ్యాయుడు చౌహాన్ నెహ్రూ, పీడీ ఆడే విశ్వనాథ్, ఏఎన్‌ఎం సింధు, ఆశ కార్యకర్త బొజ్జుబాయి ఉన్నారు.

దివ్యాంగుల పింఛన్ తక్షణమే మంజూరు చేయాలి

ఎదులాపురం: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా దివ్యాంగుల ఫింఛన్‌ను తక్షణమే మంజూరు చేయాలని జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 49 వేల మంది దివ్యాంగులు ఉన్నారన్నారు. మే 2024కి సంబంధించి రాష్ట్రంలోని ఆరు ఉమ్మడి జిల్లాలకు ఇప్పటికే ఆసరా పింఛన్ మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రతీనెల మొదటి వారంలోనే మంజూరు చేయాలని, కోరారు. కార్యక్రమంలో నాయకులు దండ్ల అశోక్, బావునే నగేశ్, నానయ్య, శంకర్, ప్రమోద్ కుమార్, హన్మంతు, దిలీప్ పాల్గొన్నారు.

ఎరుకల కులస్తుల సమస్యలు పరిష్కరించాలి

ఉట్నూర్‌రూరల్: ఎరుకల కులస్తుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఎరుకల ప్రజాసమితి రాష్ట్ర అధ్యక్షుడు కెమసారం తిరుపతి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా కార్యకర్తల సమావేశం ఉట్నూర్‌లో నిర్వహించారు. ఐటీడీఏ నుంచి ప్రత్యేక నిధుల కేటాయించి ప్రతీ ఎరుకల కుటుంబానికి మూడు ఎకరాల భూమి కేటాయించాలన్నారు. పందులు పెంపకం కోసం షెడ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ఎస్సీ, ఎస్టీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. నాయకులు తిరుపతి సంపత్, వెంకటేశ్, జగన్నాథుల సంతోశ్, ఉంద్రాల ఎల్లయ్య, ఉంద్రాల రవి, నగేశ్, అనిల్ పాల్గొన్నారు.

పాముకాటుతో గిరిజన మహిళ మృతి

తాంసి: భీంపూర్ మండలంలోని కైరిగూడ గ్రామానికి చెందిన గిరిజన మహిళ శుక్రవారం పాముకాటుతో మృతి చెందింది. గ్రామానికి చెందిన పెందూర్ లక్ష్మి(30) ఇంటి సమీపంలో ఉన్న పెరట్లో పని చేస్తుండగా పాముకాటు వేసింది. గ్రామస్తులు అంబులెన్స్‌కు సమాచారం అందించి ఆసుపత్రికి తరలించే క్రమంలో మృతి చెందినట్లు భీంపూర్ ఎస్సై కలీం తెలిపారు. మహిళ భర్త గత రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఇప్పుడు మహిళ లక్ష్మి మృతి చెందడంతో కుమార్తె, కుమారుడు అనాథగా మారారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇచ్చోడ: మండలంలో చేపడుతున్న మిషన్ భగీరథ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి వివరాలను సేకరించాలన్నారు.

సిరికొండ: మండలంలో కొనసాగుతున్న మిషన్ భగీరథ సర్వేను శుక్రవారం మండల కేంద్రంతో పాటు పొన్న గ్రామంలో డీఎల్‌పీవో ఫణిందర్ పరిశీలించారు. సర్వేను పారదర్శకంగా చేపట్టాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి నల్లా కనెక్షన్ ఉందా? లేదా వివరాలు అడిగి నమోదు చేయాలన్నారు. ఎంపీడీవో బాల గంగాధర్, ఎంపీవో సంతోష్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

నామమాత్రంగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ కల్యాణం లక్ష్మి

తలమడుగు: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం తూతూమంత్రంగా సాగింది. ఎంపీపీ కల్యాణం లక్ష్మి రాజేశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కాలేదు. ముందుగా ఏవో మహేందర్ ప్రగతి నివేదిక చదివి వినిపించారు. వర్షాలు కురిసేంత వరకు విత్తనాలు నాటుకోవద్దని సూచించారు. నెల తడిసిన తరువాతే విత్తనాలు విత్తుకోవాలన్నారు. పశువైద్యాధికారి దూద్‌రామ్ రాథోడ్ మాట్లాడుతూ.. వర్షకాలంలో పశువులకు నట్టాల నివారణ మందు వేయడం జరుగుతుందన్నారు. అనంతరం జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రజలకు అందుబాటులో ఉండి అనేక సమస్యలు పరిష్కరించడం జరిగిందన్నారు. తాగునీటి సమస్యలు లేకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. సమావేశంలో ఎంపీడీవో శేఖర్, ఉపాధ్యక్షురాలు దివ్య, జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, పీఆర్‌ఈ మజార్, ఐకేపీ ఏపీఎం స్వామి, తదితరులు పాల్గొన్నారు.

మాంగ్ సమాజ్ అభివృద్ధికి కృషి

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌రూరల్: మాంగ్ సమాజ అభివృద్ధికి కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలో మాంగ్ సమాజ్ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ముందుగా లహుజీ సాల్వే, బీఆర్ అంబేద్కర్, అన్నబావుసాఠే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజానికి ఎంత చేసిన తక్కువేనని, వారికి ప్రభుత్వ ఫలాలు ఇంకా అందాల్సి ఉందన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌లను మాంగ్ కులస్తులు శాలువాతో సత్కరించారు. కౌన్సిలర్లు, మాంగ్ సమాజ్ నాయకులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మాలాధారణ తర్వాతే మార్పు మొదలైంది

తన జీవితంలో అయ్యప్ప స్వామి మాలధారణ తర్వాత మార్పు మొదలైందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదిలాబాద్ పట్టణ శివారు ప్రాంతంలోని బెల్లూరి అయ్యప్ప ఆలయ వార్షికోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం అయ్యప్ప ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. మహిమగల అయ్యప్ప స్వామిని కొలిచిన భక్తులకు ఏరోజు కూడా నిరాశ కలగలేదన్నారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలన్నారు.

గాలివాన బీభత్సం

జైనథ్: మండలంలోని లేకర్‌వాడలో గాలివాన బీభత్సం సృష్టించింది. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పెంకుటిండ్లు, పశువుల పాకలు ధ్వంస మయ్యాయి. రేకులు గాలికి లేచిపోవడంతో పాటు పాత ఇల్లు కూలిపోయాయి. గ్రామంలోని ఎస్సీ కాలనీలో కరెంట్ స్తంభాలు విరిగి పడడంతో విద్యుత్ సరఫరా లేక ప్రజలు అవస్థలు పడ్డారు. పలు చేన్లలో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేల కొరగడంతో రైతులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. పలువురి ఇళ్లలోకి నీరు చేరడంతో ఆహార ధాన్యాలు తడిసిపోయాయి. శుక్రవారం సాయంత్రానికి కూడా విద్యుత్ సరఫరా అధికారులు పునరుద్ధరించలేదు.

విద్యుత్ అంతరాయం లేకుండా చూస్తాం

ఇంద్రవెల్లి: వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇస్తే వెంటనే సమస్య రాకుండా చూస్తామని విద్యుత్ శాఖ డీఈ జాదవ్ సుభాష్ అన్నారు. గురువారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షంతో కేస్లాపూర్ నుంచి దస్నాపూర్ వరకు విద్యుత్ స్తంభాలు విరిగిపోగా.. శుక్రవారం దగ్గరుండి విద్యుత్ మరమ్మతులు పనులు చేయించారు. కొత్తగా విద్యుత్ తీగలు, స్తంభాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ జాదవ్ రోహిదాస్, సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరండి

బోథ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. విద్యార్థుల వద్దకు వెళ్లి ప్రభుత్వ కళాశాలలో చేరాలని కోరారు. ఉచిత పుస్తకాలు, నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు పేర్కొన్నా రు. అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని, తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన ఉంటుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు లక్ష్మణ్, నాందేవ్, లక్ష్మిపతి, రాజు, సురేశ్ పాల్గొన్నారు.

చిన్నారికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: మండలంలోని డొంగర్‌గామ్ గ్రామానికి చెందిన అనక సంతోష్, స్వప్నలు పిడుగు పడి మృతి చెందగా.. విషయం తెలుసుకున్న అనక వంశీయులు, తుడుందెబ్బ నాయకులు శుక్రవారం వేర్వేరుగా డొంగర్‌గామ్ గ్రామానికి సందర్శించి తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారికి అనక వంశీయులు రూ. 24 వేలు, తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ నాయకులు రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రూ. 15 లక్షల ఎక్స్‌గ్రేషియ చెల్లించాలని, కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏ ద్వారా అందించే ఎమర్జెన్సీ ఫండ్ కింద వచ్చే రూ. 25 వేలు కేటాయించకపోవడం దారుణమన్నారు. నాయకులు అనక పాండురంగ్, హనుమంత్‌రావ్, రామారావ్, వెంకట రమణ, మైపతి అరుణ్, గోడం గణేష్, నగేశ్ పాల్గొన్నారు.

నగర సంకీర్తనకు 14 వసంతాలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలో ప్రతినిత్యం నిర్వహిస్తున్న నగర సంకీర్తన 14 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. 2010 ప్రారంభమైన ప్రభాతభేరి నిరంతరాయంగా కొనసాగుతూ వచ్చింది. ప్రతీరోజు ఉదయం జిల్లా కేంద్రంలోని శ్రీమార్వాడి ధర్మశాల వెంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి పట్టణ పుర వీధుల గుండా సాగుతూ.. తిరిగి శ్రీ వేంకటేశ్వర ఆలయంలో హారతి కార్యక్రమంతో ముగుస్తుంది. శుక్రవారం పట్టణంలో ప్రత్యేక శోభాయాత్ర చేపట్టారు. నగర సంకీర్తన సభ్యులు కమల్ కిషోర్ మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పవన అగర్వాల్, మహేశ్ కేతన్, బండారి దేవన్న, సతీష్, స్వామి, సంతోశ్ పాల్గొన్నారు.

గుట్కా స్వాధీనం

కైలాస్‌నగర్: అక్రమంగా నిల్వ ఉంచిన నిషేధిత గుట్కాను స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ ఎస్సై జి.నారాయణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని కుమార్‌పేట్ సమీపంలోని మథుర జిన్నింగ్ గోదాంను మహ్మద్ జీషాన్ అనే వ్యక్తి అద్దెకు తీసుకున్నాడు. అందులో నిషేధిత గుట్కాను నిల్వ ఉంచాడు. పక్కా సమాచారం మేరకు శుక్రవారం పోలీసులు గోదాంపై దాడులు నిర్వహించగా రూ.4లక్షల 20 వేల 540 విలువ గల గుట్కా లభ్యమైనట్లు పేర్కొన్నారు. వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలోని శివాజీ చౌక్‌లో సయ్యద్ ఖసీఫ్ అలీ అనే వ్యక్తి గుట్కా విక్రయిస్తుండగా శుక్రవారం సాయంత్రం పట్టుకున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా.. రూ. 8450 విలువగల గుట్కా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

ఒకరి అదృశ్యం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణం ఖుర్షీద్‌నగర్‌కు చెందిన నలగంటి రాజు అనే వ్యక్తి ఈనెల 6న అదృశ్యమైనట్లు టూటౌన్ ఎస్సై లాల్‌సింగ్ నాయక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రిమ్స్ ఆసుపత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిన స్వీపర్‌గా పనిచేస్తున్న రాజు సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి వరకు కూడా రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆయన కోసం గాలించినా.. ఆచూకీ లేకుండా పోయింది. దీంతో శుక్రవారం కుటుంబసభ్యులు టూటౌన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

బజార్‌హత్నూర్: మండలలలోని వర్తమన్నూర్ గ్రామంలో ఈదుల లింగన్నకు చెందిన ఇల్లు షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున నిద్రలో ఉండగా.. ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. వెంటనే లేచి చూట్టూ పక్కల వారిని లేపి మంటలు ఆర్పే ప్రయత్నం చేశాం. మంటలు అదుపులోకి రాక పూర్తిగా ఇల్లు దగ్ధమైంది. ఎస్సై నరేశ్, మండల రెవెన్యూ అధికారి మురళీధర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి రూ.2.50 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.